# గులాబీ

జయంతి



నా మనసులో ఏదో అవ్యక్తమైన ఆవేదన ముసురులా కమ్ముకుంది. అలాంటప్పుడు ఏ పనీ చేయబుద్ధికాదు. ఇంటి ముందున్న ఆవరణలోని గులాబీ చెట్టు దగ్గిరికి పోయి కూర్చోవా లనిపిస్తుంది.

కాని ఈ వేళ లేవలేనంత నీరసంగాఉన్నది. అయినాగాని పడక కుర్చీ బయటికి లాగి గులాబీ చెట్టుకి ఎదురుగా కూర్చున్నాను.

ఆ గులాబీ చెట్టంటే నాకు ప్రాణం.

నేను దగ్గిరికి వెళ్ళగానే అది తలాడించింది.

నాకు తెలును, అది నన్ను గుర్తిస్తుందని. మేమిద్దరం ఎన్నో

మాటలు మాట్లాడుకుంటాము. నా మనసు దానికి తెలుసు.

గులాబీ నాతో మాట్లాడినప్పుడల్లా జీవితమంటే ఇలా ఎర్ర గులాబీ మొక్కని చూస్తూ ఉండటమే అనిపిస్తుంది నాకు.

స్నేహితులంటే ఇష్టం లేదు నాకు. నేనొక మాట అన్నానంటే వాళ్ళింకొక మాట అంటారు.

నాగేశ్వరరావు చాలా బాగా యాక్టు చేస్తాడూ, అంటే– "నో,నో. రెక్స్ హారిసన్ ఈజ్ సూపర్బ్" అంటారు. రెక్స్ హారిసన్ సూపర్బ్ అని నాకూ తెలుసు. అంతమాత్రాన నాగేశ్వరరావు బాగా నటించ కూడదని ఎక్కడుంది?

పూలంటే నాకు చాలా ఇష్టం. మల్లెపూలన్నా, గులాబీ పూలన్నా నాకు ప్రాణం – ఉత్త ఆడమనసు, ఫెమినైన్ ఇన్‌స్టింక్ట్స్, అని ఎగతాళి చేస్తారు.


పూలని మెచ్చలేని మనసు మమతలనూ మెచ్చలేదని నా నమ్మకం. అందుకే వాళ్ళ నుంచి దూరంగా పారిపోతాను. ప్రేమ వేరు, తృష్ణ వేరు – అంటాను నేను.

కాదు. ప్రేమ, తృష్ణ రెండూ ఒకటే, ఒకదాన్లోనుంచి ఇంకొకటి వస్తాయి అంటారు వాళ్ళు. ఒకళ్ళిద్దరయితే సాహసం చేసి, "మరీ పోజు కొట్టకు గురూ. నీకు మాత్రం మనసులో కోరిక లేదంటే నేను నమ్మను. సెక్స్ ఈజ్ ఎవ్విరిథింగ్ ఇన్ లైఫ్" అంటారు. నాకు అసహ్యమేస్తుంది. అక్కడి నుంచి లేచిపోతాను. ప్రేమంటే గుర్తుకు వచ్చింది. నూటికి తొంభై అయిదు గురు ప్రేమంటే ఏమిటో తెలియకుండానే చచ్చిపోతారు. వాళ్ళతో చిక్కే లేదు

మిగిలినవారిలో కొందరు జాలి, ఇంటిమెసీ, ఆకర్షణ, అలవాటు – వీటినే ప్రేమనుకుంటారు.

తల్లి తండ్రిలేని పిల్లతోనో, లేక ఆ ఇద్దరూ ఉండి డబ్బులేని పిల్లతోనో నువ్వు స్నేహంచేసి పెళ్ళి చేసుకుంటే అది ప్రేమగాదు. జాలి, కరుణ.

అలాగే నీ ఆఫీసులో నీతోపాటు పనిచేసేఅమ్మాయినో,నీ సహాధ్యాయినో, ఏడాది స్నేహం తరువాత నువ్వు హఠాత్తుగా ప్రేమించావు. అని తెలుసుకుంటే అది ప్రేమగాదు. పరిచయంలో నుంచి డెవలప్ అయిన ఇంటిమెసీ. ముందు గది కిటికీలో నుంచో, మీ ఇంటి డాబా మీద నుంచునో మీ ఎదురింటి అమ్మాయిని నువ్వు రోజూ చూస్తూ, హఠాత్తుగా ఒకవారం ఆ అమ్మాయి వాళ్ళింటి గుమ్మంలో కనపడకపోతే బాధపడి, ఆ బాధనే ప్రేమ అనుకుంటే అది పొరపాటు. అది ప్రేమ కాదు. అలవాటు. ఈ అలవాటులోని బాధ ఎటువంటిదంటే — మీ ఇంట్లో మీ చిన్న తమ్ముడు పెంచే కుక్కపిల్లంటే నీకు భయమూ, అసహ్యమూ. అయినాగాని, దానిని రోజూ చూస్తూ ఉండటంచేత, అది చచ్చిపోయిన తరువాత, ఇంట్లో వారందరితోపాటు నువ్వూ ఏదో




వెలితిగానే బాధపడతావు. ఇటు వంటి బాధే అదీనూ.

ప్రేమంటే అసలు వేరే ఉంది.

ప్రేమ ఏ నీతిని, నియమాన్ని అనుసరించి ఉండదు. దానంతట దానికి అస్తిత్వము ఉంటుంది. చుట్టూ ఉన్న పరిస్థితుల కనుగుణంగా అది అంకురించదు. అందుకే ప్రేమ ఎప్పుడూ పరిస్థితులకి అనుగుణంగా ఉండదు. పరిస్థితులే ప్రేమ కనుగుణంగా ఉండాల్సిందే. ఉంటే సరే సరి లేకపోతే ధనాధన్, ఫటాఫట్. నీ జీవితంలో అంతా సంఘర్షణే.

నువ్వు ప్రేమించిన మనిషి నీ కంటె పెద్దది కావచ్చు, పెళ్ళయినది కావచ్చు, పిల్లల తల్లి గావచ్చు. నీ కంటె చిన్నది పెళ్ళి గానిదే అయి ఉండాలనేం నియమం లేదు.

నువ్వు ప్రేమించిన మనిషిని మొట్టమొదటిసారిగా చూసిన క్షణం చాలునువ్వుతల్లక్రిందులుకావటానికి. ఆమెను చూసిన మరుక్షణంలో అంతర్ముఖమై నీలో ఉన్న ఏదో అవ్యక్తమైన రాగజలధికి ఆనకట్ట తెగుతుంది. ఆ వరదలో నువ్వు ఉక్కిరిబిక్కి రవుతావు.

ఆత్మను ఆత్మ గుర్తిస్తుంది.

ఒకటిగా అయిపోవాలనుకుంటుంది.

అదీ ప్రేమంటే.

అలాంటి అనుభవం జీవితంలో ఎంతమందికి కలుగుతుంది?

నూటికో కోటికో ఒకరికి.

అసలలాంటి అనుభవం కలుగ

కుండా ఉంటేనే మేలు. ఆ అనుభవం ఎప్పుడూ కూడా నువ్వు పాటించవలసిన నియమాలకు నిబంధనలకి కట్టుబడి ఉండదు. ఆ నిబంధనలను కాదనగల శక్తి నీకుండదు.

అయినా గాని ఈ అనుభవాన్ని పొందుతావు. ఈ అనుభవం అంటే కోటి విద్యుద్దీపాల కాంతి.

నీ చుట్టూ ఉన్న స్వార్థం, ఈర్ష్యాద్వేషాల చీకటి నుంచి ఒక్కసారి నువ్వు అంత వెలుగులో పడతావు.

నిబంధనలు, నియమాలూ అడ్డు వస్తాయి. ధైర్యం చాలక ఆ వెలుగులో నుంచి తిరిగి చీకటిలోకి జారుకుంటావు. అసలంత వెలుగనేది ఉంటుందని నీకు తెలియకపోతే చిక్కేలేదు.

చీకటిలో ప్రారంభమయిన నీ బ్రతుకు చీకటిలోనే అంతమవుతుంది, ఆనందంగా.

కాని అంతటి వెలుగుని చూసినట్లయితే, తిరిగి నువ్వు చీకటిలో ఎలా బ్రతకగలవు?—బ్రతకలేవు.

అందుకే నా మనసులో ఈనాడు ఈ ఆవేదన.

అందుకే నేను గులాబీ చెట్టు దగ్గిర కూర్చున్నాను.

ఈ గులాబీకి, నేను చూసిన వెలుగుకీ సంబంధమున్నది. ఆ వెలుగులో నుంచి వచ్చిందే ఈ గులాబీ. గులాబీని చూసినప్పుడల్లా ఆ వెలుగు కళ్ళముందు కనిపిస్తుంది నాకు. అందుకే గులాబీ


ప్రఖ్యాత ఔషధము

60 యేండ్లకు పైగా

జమ్మివారి లివర్ క్యూర్

బిడ్డల యొక్క లివర్ మరియు స్ప్లీన్ వ్యాధులకు ప్రఖ్యాత ఔషధము.

జమ్మి వెంకటరమణయ్య & సన్స్, మద్రాస్-4.

బ్రాంచీలు:

బెంగళూరు-2; కుంబకోణం:

తిరుచిరాపల్లి-2; హైదరాబాద్-20

JV/17/STE



ఎదురుగా కూర్చుని చీకటిని పార ద్రోలటానికి ప్రయత్నిస్తాను.

నేను చూసిన ఆ వెలుగు పేరు అరుంధతి.

అరుంధతంటే మా కరణంగారి విధవ రెండవ కోడలు.

'నువ్వు నన్ను మర్చిపోయి బతుకు గోపీ. నా వైధవ్యం నీ జీవితాన్ని తినేస్తోంది' అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్న ఆమది.

రెండు నెలలు నేను టైఫాయిడ్ జ్వరంతో మంచమెక్కితే మా ఇంట్లోకి వచ్చి నన్ను చూసే సాహసంలేక, వాళ్ళ ఇంటి గుమ్మంలోనే అటూ ఇటూ తచ్చాడి, దేవునికి మొక్కుకున్న నిస్సహాయురాలు.

గుడికి వెడితే దేవుడికి దణ్ణం పెట్టుకోగానే నన్నే చూస్తూ నిలబడేది.

"నీలోనే నాకు దేవుడు కనబడుతాడు. దేవుడు కనిపించాల్సిన చోట నువ్వే కనపడతావు. నువ్వే నా దేవుడివి."

—అని నా తల నిమిరింది ఒకసారి.

అది వెలుగు.

"అరుంధతిని చేసుకుంటే బావిలో పడిచస్తా" అని బెదిరించింది, పక్షవాతంతో మంచమెక్కిన అమ్మ.

"నువ్వు మంచంలోనుంచే లేవలేవు, పెరట్లో బావిదాకా ఎలా వెళ్ళగలవు" అని అడగగల ధైర్యం నాకు లేకపోయింది.

బావిలో పడకపోయినా, తొందరలో ఏదో ఒకరోజున అమ్మ రోగంతో చనిపోతుందని నాకు తెలుసు.

అయినాగాని నా మూలంగా చస్తుందేమోనని భయపడ్డాను.

ఒకరిచావుని మరొకరెంతమటుకు అరికట్టగలరు?

అమాట అన్న మూడు నెలలకే అమ్మ చనిపోయింది.

"అరుంధతితో మాట్లాడావంటే, నేనూ, నీ వదినాకూడా తలెత్తుకు తిరగలేం ఈ ఊళ్ళో. జరుగకూడనిది ఏదైనా జరిగితే నీకూ, మాకూ ఏ విధమైన సంబంధంవుండదు" అని శాసించాడు అన్నయ్య.

అన్నయ్యంటే గౌరవం, వదినంటే అపేక్షా నాకు.

కాదనలేకపోయాను.

కాని అన్నయ్యే, మావయ్యలతో కలసి దొంగవిల్లుసృష్టించి ఇంట్లోంచి తరిమేశాడు నన్ను.

అప్పుడు తెలుసుకున్నాను, తాటాకు చప్పుళ్ళకే బెదిరిపోయానని.

కాని ఇప్పుడు కావాలనుకుంటే మాత్రం నా అరుంధతి ఎక్కడినుంచి వస్తుంది?

నన్ను బెదిరించిన వాళ్ళంతా నిక్షేపంగా వారి దోవలు వారు చూసుకున్నారు. కాని అరుంధతి చచ్చిపోయింది.

కిరసనాయిల్ అంటించుకుని మరీ చచ్చిపోయింది.

పోతూ పోతూ ఈ గులాబీ మొక్కని నాకిచ్చిపోయింది.

ఆ రోజెంత గొడవ జరిగిందని!

నేనూ, అమ్మ, వదిన, మావయ్యలు, అన్నయ్య అందరం చావిట్లో ఉన్నాము.

'గోపీ' అని ఎవరో వాకిట్లోంచి పిలచినట్లయింది.

ఆ గొంతువిన్న నేను ఉలిక్కి పడ్డాను.

నాలిక తడారిపోయింది. లేచి బయటికెళ్ళే లోపల అరుంధతి చేతిలో ఇంత గులాబీమొక్క పట్టుకుని వచ్చింది.


ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు

ఆరోగ్య సౌభాగ్యములకు ఆధారపడునది లోధ్ర

66 సంవత్సరముల పైగా ప్రసిద్ధినొందినది




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్

రాయపేట, మద్రాసు-14

ఏజెంట్లు:

సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)

విజయవాడ - సికిందరాబాదు - మధుర - బరహంపురం - బెంగుళూరు


నాకు నిలువెల్లా చెమట పోసింది.

మిగతా వాళ్ళందరూ నిశ్శబ్దంగా ఆమెని నమిలి మింగివేసేటట్లు చూశారు.

'గోపీ, ఇదుగో ఈ గులాబీ నీ దగ్గిరుంచుకో. ఈ మొక్కని వాడనివ్వకు'—అని ఆమొక్క నాచేతిలో ఉంచింది.

నేను అయోమయంగా అందుకున్నాను.

ఆమె తిరస్కారంగా అక్కడున్న మనుషులందరివంక చూసి 'వీళ్ళ వ్యరినీడా సోకనిచోట ఈ గులాబీని పెంచు. వీళ్ళగాలి తగిలితేనే అది మాడిపోతుంది' అన్నది.

నిరుత్తరుడినయి చూశాను.

'గోపీ నేను వెళుతున్నాను' అని నన్ను బలంగా హృదయానికి హత్తుకుని నుదుటిపై ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది.

నేను నిశ్చేష్టుడి నయిపోయాను.

చెప్పలేని భయం కలిగింది. పిరికివాడిని.

నా భయాన్ని నిజంచేస్తూ అలా వెళ్ళిపోయిన అరుంధతి కిరసనాయిల్ పోసి అంటించుకుని చచ్చిపోయింది.

పీడ విరగడయిందన్నారంతా.

ఇప్పుడేది వాళ్ళంతా? అమ్మ చనిపోయింది.

అన్నయ్య, వదిన, మావయ్యలతో కలసి దొంగవిల్లుసృష్టించి ఇంట్లోంచి తరిమేశారు నన్ను.

వాళ్ళందరికోసం పిరికివాడి

నయ్యాను నేను.

నా వెలుగులోనుంచి చీకటిలోకి జారుకున్నాను.

ఇప్పుడు నాకు మిగిలింది చీకటే.

ఇన్నిరోజులూ భద్రంగా అరుంధతి ఇచ్చిన గులాబీ మొక్కని కాపాడుకుంటూ వస్తున్నాను.

ఆ చెట్టున పువ్వు పూచినప్పుడల్లా అరుంధతి నవ్వినట్లు అనిపిస్తుంది నాకు.

పడక కుర్చీలోనుంచి మెల్లిగా గులాబీ తల నిమిరాను.

'గోపీ. వెంటనే రావాలి. మీ అన్నయ్యకు కారు క్రిందపడి కాలు విరిగింది'—వదిన ఏడుస్తూవచ్చి నిలబడింది.

నివ్వెరపోయాను.

వెళ్ళమంటావా అని గులాబీని అడిగాను, తలాడించలేదు. వెళ్ళవద్దు అన్నట్లుగా నిశ్చలంగా ఉన్నది.

'గోపీ ప్లీజ్. జరిగినదంతా మర్చిపో. ఒక్క కడుపున పుట్టిన వాళ్ళు. నువ్వు కాకుంటే ఎవరాదుకుంటారు' వదిన నా రెండు చేతులూ పట్టుకుంది. ఆమె కళ్ళనుండి నీళ్ళు జారి నా చేతులపై పడుతున్నాయి. బలహీనుడి నయ్యాను.

'పద వదినా' అని హడావుడిగా పరుగెత్తాను, పనిపిల్లవాడిని ఇంటికి కాపలా పెట్టి.

అన్నయ్యని హాస్పిటల్ లో చేర్పి' ఫరవాలేదు అన్న తరువాత ఇంటికి వచ్చేటప్పటికి చీకటి పడబోతుంది.

ఇల్లు తాళంవేసి ఉంది.

నేను ఇంటికి కాపలా పెట్టి వెళ్ళిన పనిపిల్లవాడు లేడక్కడ.

ఎక్కడ షికార్లు కొట్టటానికి వెళ్ళాడో?

ఉసూరుమంటూ గులాబీ దగ్గరికి వెళ్ళి నుంచున్నాను.

'మే... మేమే...' అని అరుస్తూ మేక అక్కడినుంచి పరుగెత్తింది.

నా కళ్ళు బైర్లు గమ్మాయి.

ఆ మేక తిని వెళ్ళగా మిగిలిపోయిన గులాబీ చెట్టు చిన్న మొండెం నా కళ్ళముందు కనపడింది.

ఆ చీకటిలోకి జారిపోయి అక్కడే కూలబడ్డాను.

మేకలాంటి నా మనసులోఉన్న పిరికితనం అరుంధతిని కబళిస్తే, మేక ఆమె ఇచ్చిన గులాబీని కబళించింది.

□□□